ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 27 సంచిక : 8 ఏప్రియల్ 2022

## ఈ సంచికలో. . . .

భగవాన్ ఆరాధన ........................................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

అక్షరమణమాల ....................................................... 20

నాన్నగారు - శాంతి సముద్రం ..................................... 23

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఆత్మ ఎప్పుడూ ఉంది. నువ్వు సంపాదించేది కాదు. నువ్వు సంపాదించింది ఎప్పటికైనా కాల ప్రవాహంలో కొట్టుకుపోతుంది. శరీరం వచ్చినప్పుడే అది ఎప్పుడు చని పోవాలో నిర్ణయించి పంపుతాడు. సంపద కూడా వచ్చినప్పుడే ఎలా పోవాలో నిర్ణయం అయిపోతుంది. ఈశ్వర నిర్ణయం అనేది మహాప్రవాహం.

**గమనిక:** గత సంచిక రమణ భాస్కరలో (Vol: 27, Issue: 07, 05-03-2022) భగవద్గీత శ్లోకం సంఖ్య తప్పగా ముద్రించబడినది. సరైన సంఖ్య 06:27 (అధ్యాయం 6, శ్లోకం 27). పాఠకులు గమనించి మన్నించగలరు.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ|| 150/-

విడి ప్రతి : రూ|| 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342



# భగవాన్ ఆరాధన

**(భగవాన్ ఆరాధన సందర్భంగా, శ్రీ నాన్నగారి అనుగ్రహ వాక్యాలనుండి కొన్ని స్మృతులు)**

## నాన్నగారిని బంధించిన రమణమహర్షి గారి వాక్యం

"రమణ మహర్షిగారు ఒక వాక్యం చెప్పారు, అది నన్ను బంధించింది. అది ఎప్పుడైనా చెప్పానో లేదో మీకు. ప్రతి మనస్సుని, ఆస్తికుడైనా నాస్తికుడైనా, అందరినీ అరెస్ట్ చేస్తుంది ఈ వాక్యం" అన్నారు నాన్నగారు.

మీకు కోటి సమస్యలు ఉన్నా - "ది సొల్యూషన్ టు ఆల్ యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హూ హేజ్ ఇట్" (The solution to all your problems is to see who has it. ) అంతే అయిపోయింది!

మీకు కోటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం ఒకటే. ఈ సమస్యలు అన్నీ ఎవరికి ఉన్నాయి. మీ శరీరానికి ఉన్నాయా, లేకపోతే మీ లోపల ఉన్న చైతన్యానికి ఉన్నాయా? లేకపోతే నేను అని చెపుతున్నావు కదా నువ్వు, ఆ నేనుకి ఉన్నాయా? మేము సమస్యల తోటి చచ్చిపోతున్నాము అంటారు కదా అందరూ!మీకు కోటి సమస్యలు ఉన్నా ఒకటే పరిష్కారం. "ది సొల్యూషన్ టు యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హూ హేజ్ ఇట్". మీకు కోటి సమస్యలు ఉంటే, అవి మీ దేహానికి ఉన్నాయా, లేకపోతే చైతన్యానికి ఉన్నాయా. దేహం జడం, దానికి సమస్యలు ఏమిటి! చైతన్యానికి ద్వితీయం లేదు, ఇంక సమస్య ఏమిటి!. నేను నేను అంటున్నావు కదా నువ్వు, ఈ సమస్యలు అన్నీ కూడా ఆ నేనుకే వస్తున్నాయి.

నీకు తెలుస్తోంది కదా!

"ది సొల్యూషన్ టు యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హూ హేజ్ ఇట్" - ప్రశ్న లోనే సమాధానం ఉంది. పరీక్ష పేపరు లో కూడా, ప్రశ్న పది సార్లు చదువుకుంటే, ఆ ప్రశ్నలోనే సమాధానం కూడా ఇమిడి ఉంటుంది. కొబ్బరి చెట్టు గురించి అడిగితే తాటి చెట్టు గురించి రాసేస్తే ఎలాగ! అందుచేత నీకు కోటి సమస్యలు ఉన్నా నువ్వు కంగారు పడక్కరలేదు. ఈ సమస్యలు అన్నీ ఎవరికి ఉన్నాయి, కంగారు పడకుండా చూసుకోనువ్వు. అప్పుడు నీకు భయమే పుట్టదు. ఈ సమస్యలు అన్నీ నేనుకి ఉన్నాయి. ఆ నేను, ఇతర తలంపులు కలిపి మనస్సు అంటారు.

"ది సొల్యూషన్ టు ఆల్ యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హూ హేజ్ ఇట్". ఈ సమస్యలు అన్నీ ఎవరికి ఉన్నాయి అని నువ్వు పరిశీలనలోకి దిగితే, ఎవరికైతే ఈ సమస్యలు ఉన్నాయో అది ఎంత అసత్యమో, ఈ సమస్యలు కూడా అంతే అసత్యం అని తెలుస్తుంది. ఏ అసత్యాన్ని, ఏ మిథ్యానేనుని పట్టుకొని ఈ సమస్యలు వేలాడుతున్నాయో, అది రాలిపోయి నప్పుడు ఈ కోటి సమస్యలు కూడా రాలిపోతాయి. ఈ సమస్యలు కాదు నువ్వు చూడవలసింది ఎవడికి ఉన్నాయి ఈ సమస్యలు అని చూడాలి.

చాలామంది మాకు భయం వేస్తోంది అంటారు. ఎవరికి భయం వేస్తోంది - నీ లోపల ఉన్న దేవుడికి భయం వేస్తోందా, లేకపోతే నీ శరీరానికి భయం వేస్తోందా! ఈ నేనుకే భయం వేస్తోంది. ఆ నేను ఎవడు అని నువ్వు పరిశీలనగా చూస్తే ఆ నేను పడిపోతుంది. నేను పడిపోతే ఆ నేనుకి అంటిపెట్టుకొని ఉన్న సమస్యలు కూడా రాలిపోతాయి. విడి విడిగా నువ్వు పరిష్కారం చెయ్యక్కరలేదు.

"ది సొల్యూషన్ టు ఆల్ యువర్ ప్రోబ్లమ్స్ ఈజ్ టు సీ హూ హేజ్ ఇట్". ఈ వాక్యాన్ని మీరు రాసుకొని ఒకసారి ఇంటిదగ్గర పరిశీలన చేసుకుంటే, ఈ వాక్యాన్ని మననం చేసుకుంటే ఆ నేను పడిపోతుంది. ఈ సమస్యలు అన్నీ ఏ నేనుకి అయితే ఉన్నాయో ఆ నేను పడిపోతుంది.

## రమణస్వామి అంతస్తు - మౌనమే అనుగ్రహం

రమణస్వామి దేవుడు అనే పేరు కూడా వినకుండా దేవుడు అయ్యాడు, శివుడు

అనే పేరు కూడా వినకుండానే శివుడు అయ్యాడు. అది రమణస్వామి యొక్క అంతస్తు! చెవులు ఉన్నవారు అందరూ వినండి, కళ్ళు ఉన్న వారందరూ చూడండి!

రమణస్వామి నిన్నకాక మొన్నటి వాడు. 1950 వరకు ఆయన ఫ్లెష్ అండ్ బ్లడ్ (flesh and blood) తో శరీరంలో ఉన్నాడు. అందుచేత ఇదేదో పుక్కిటిపురాణం కాదు. రాధాకృష్ణన్ అన్నారు, "ఇఫ్ యు వాంట్ టు సీ గాడ్ ఇన్ ఫ్లెష్ అండ్ బ్లడ్ సీ రమణమహర్షి". (If you want to see God in flesh and blood see Ramana Maharshi). సాధారణంగా రమణస్వామి ఉదయం నుండి సాయంత్రం వరకు తక్కువ మాట్లాడతారు, హి ఈజ్ ఎ మాన్ ఆఫ్ ఫ్యూ వర్డ్స్ (he is a man of few words). నిజమైన జ్ఞానికి మాటలతోటి పని లేదు.

కృష్ణుడు చెప్పిన జ్ఞాని యొక్క స్థితిని నిజం అని ఋజువు చేసినవాడే రమణస్వామి. లోకానికంతటికీ గమ్యం అయినటువంటి, లోకానికి ఆధారంగా ఉన్నటువంటి ఆ పరమార్థాన్ని పొందినటువంటి వాడు రమణస్వామి. ఆయనని ఆధారంగా చేసుకొని అనేకమంది జ్ఞానదీపాలు వెలిగించుకొన్నారు. మతాల పేరుమీద చాదస్తాల పేరుమీద రాంగ్ డైరెక్షన్‌లో ప్రయాణం చేస్తున్న లోకాన్ని ఆత్మ వైపుకి తిప్పిన వాడే రమణస్వామి. ఆయన సందేశాన్ని, అరుణాచలం నుండి కదలకుండానే, మాటలతోటి సంబంధం లేకుండానే, ప్రపంచానికి అంతటికీ తెలియపరిచాడు. ఆయన మెస్సేజ్ అలా అందించగలగటానికి కారణం, లోకంఅంతా కూడా ఆయనే, తనకంటే వేరుగా ఏమీ లేదు. మౌనం తోటే అనేకమంది జీవితాలు మారిపోయాయి. రమణస్వామి పేరు వినటం వల్ల, ఆయన దర్శనం చేయటం వల్ల, ఆయన మాటలతోటి నిమిత్తం లేకుండా అనేకమంది జీవితాలు మారిపోయాయి. ఎక్కడైతే పవిత్రత ఉందో, ఎక్కడైతే ఏకాగ్రత ఉందో, ఎక్కడైతే జీవితంలో సౌందర్యం ఉందో, ఆ మనిషిని చూసినప్పుడు మనం కూడా తప్పనిసరిగా మనస్సుని మార్చుకుంటాము. మన జీవిత విధానం మార్చుకుంటాము. జ్ఞానం వైపుకి మన ముఖాన్ని తిప్పుకుంటాము.

రాజేంద్రప్రసాద్ ఒకసారి భగవాన్‌తో, మహాత్మాగాంధీగారు నన్ను మీ దగ్గరకు పంపించారు. మీరు చెప్పవలసిన మాటలు ఉంటే నేను బాపూజీ తోటి చెపుతాను అన్నారు. అప్పుడు రమణస్వామి "హృదయం హృదయంతోటి మాట్లాడేటప్పుడు మాటలతోటి పని లేదు" అన్నారు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 25 ఆగష్టు 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

స్వామి సొత్తు అందరికీ సొత్తే! ఒకసారి భగవాన్ కోసం ఎవరో మంచి అందమైన పులి చర్మం తెచ్చారు. స్వామి మీరు ఒకసారి లేవండి అక్కడ పులి చర్మం వేస్తాం అన్నారు. సరి సరి అన్నారు భగవాన్. అప్పుడు దాని మీద కూర్చున్నారు స్వామి. నాలుగు రోజుల తరువాత ఇంకొకరు వచ్చారు ఆ చర్మం మన ఇంటికి పట్టుకు పోతే బాగుండును అని ఆయనకి అనిపించింది. ఇదీ భక్తే, అదీ భక్తే! మీరు వీటిని శంకించకూడదు. ఇదీ భక్తి తోటే. దొంగ అని మనం ఎందుకు అనుకోవాలి. భగవాన్‌తో స్వామి ఆ చర్మం మా ఇంటికి పట్టుకుని వెళ్ళాలి అని ఉంది అని చెప్పారు. స్వామి ఏమి చేసారు అంటే ఆయన వేస్తాం లెగమంటే లేచారు, ఈయన పట్టుకు పోతాను అంటే లేచారు. ఈయన ఆ చర్మం పుచ్చుకుని రోడ్డు మీద గేటు ఉంటుంది చూడండి ఆ పెద్ద గేటు దగ్గరకి వచ్చేటప్పటికి ఎవరో చూశారు నువ్వు స్వామి చర్మం పట్టుకు పోతున్నావు, నీకు ఇంక చర్మాలు ఎక్కడా దొరకలేదా, స్వామి కూర్చున్న చర్మం పట్టుకుపోవాలా, అని అడిగితే అతను కంగారు పడి మళ్ళీ వెనక్కి తెచ్చేశాడు. అక్కడికీ భగవాన్ చెప్పారు ఏవయ్యా నువ్వు పట్టుకు పోతున్నావు ఎవరైనా చూస్తే పుచ్చుకుంటారు అని. అందుచేత ఖరీదైనవిమనకి ఎందుకు అనేవారు ఎవరైనా ఖరీదైనవి ఆయనకి ఇస్తే, ఇచ్చినప్పుడు స్వామి సరి సరి అన్నారు. పట్టుకుపోతుంటే సరి సరి అన్నారు.


చాలామంది చెబుతారు భగవాన్ గురించి, భగవాన్‌కి పెళ్ళాం అంటే లేదు కానీ సంసారికి ఉండవలసిన లక్షణాలు అన్నీ ఉన్నాయి అని చెబుతారు. నువ్వు సన్యాసం పుచ్చుకో, ఎర్ర బట్టలు కట్టుకో, ఇల్లు విడిచి పెట్టి పారిపో అని ఎవరి తోటి ఆయన చెప్పలేదు. అన్ని సదుపాయాలూ ఇంటికాడ ఉండగానే నువ్వు మనసును నిగ్రహించుకోలేకపోతే, జ్ఞానం సంపాదించలేకపోతే ఇల్లు విడిచి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోతే నువ్వు సంపాదిస్తావు అని guar-

antee ఏముంది, ఎక్కడున్నా మనస్సునే కదా నిగ్రహించుకోవాల్సింది. భగవాన్ అందుకే చెబుతారు. చావు కోసం కూడా ఎదురుచూడద్దు అంటారు. చావు వస్తే శరీరాలు మారతాయి, పరిసరాలు మారతాయి, ఇల్లు మారుతుంది, చోటు మారుతుంది, లోకం మారచ్చు, దేశం మారచ్చు, జాతి మారచ్చు, వర్ణం మారచ్చు, రంగు మారచ్చు, అప్పుడు కూడా ఈ మనస్సే నీ కూడా ఉంటుంది. నువ్వు ఎక్కడికి హిమాలయ పర్వతాలకి పరుగెత్తుకుంటూ వెళ్లినా నీ మనస్సు కూడా వస్తుంది. మరణించినప్పుడు నీ శరీరం బూడిద అవుతుంది కానీ, నీ మనస్సు బూడిద అవ్వదు. నీ మనస్సుని ఇప్పుడు ఇక్కడ ప్రయత్నం చేసి పరిష్కారం చేసుకోవడం మానేసి మరణం కోసం నువ్వు ఎదురు చూసినా, దేహం మరణించటం వలన నీ సమస్య పరిష్కారం కాదు. మనస్సుని ఎలా మార్చుకోవాలి? అది మనం ఆలోచించ వలసినది, చావు గురించి కాదు. మీకు ఒక్కటే కొండ గుర్తు. మీకు మోక్షం ఏ జన్మలో వస్తుంది అంటే నేను మరణిస్తున్నాను, నేను మరణిస్తున్నాను అనుకుంటాం కదా అలా అనుకునే వాడికి మరణం వస్తే ఆ గంటలో వాడికి మోక్షం వచ్చి మీద పడుతుంది. శరీరం నేను అని అనుకుంటున్నాను కాబట్టి, ఈ దేహమే నేను అనే భావన నాకు ఉంది కాబట్టి దేహం చనిపోయినప్పుడు నేను చచ్చిపోతున్నాను, చచ్చిపోతున్నాను అనుకుంటాను. ఈ దేహమే నేను అనే భావన మనలో ఉంది చూశారా, జీవ లక్షణాలు ఉన్నాయి చూశారా అవి మరణించాలి. అంతవరకు మోక్షం లేదు వాడికి, ఇదంతా మాయ!

ఏ సత్యవస్తువు కోసం అయితే మనం వెతుకుతున్నామో, ఏ వస్తువు కోసం అయితే జన్మ జన్మలు కాలం ఖర్చు పెట్టి వెతుకుతున్నామో, ఆ వస్తువు ఇక్కడే మన హృదయంలో సాక్షాత్తుగా ఉంది. ఏవండీ మీరు నాకు దగ్గరగా కూర్చున్నారు. కానీ మీకంటే నాకు దగ్గరగా కూర్చున్నవాడు ఈశ్వరుడు. మీకు అనిపిస్తుంది నేను దగ్గరగా కూర్చున్నాను అని, కానీ మీకంటే దగ్గరగా కూర్చున్న వాడు ఈశ్వరుడు. అయితే ఈశ్వరదృష్టి లేని మూలాన, భౌతికదృష్టి మనకి ఉన్న మూలాన, మీరే నాకు దగ్గరగా కూర్చున్నారు అనిపిస్తుంది. మీకంటే నాకు దగ్గరగా ఉన్నాడు ఈశ్వరుడు. మన ఇంట్లో వాళ్ళు అందరు మనలని ప్రేమిస్తున్నారు

అని, మనం ఇంట్లో వాళ్ళని ప్రేమిస్తున్నాం అని అలా మనకు అనిపిస్తుంది అంతే, అది ప్రేమ కాదు భ్రాంతి. మనం భ్రాంతి పడుతున్నాము అంతే.

రామకృష్ణుడు దగ్గరకి ఒకతను వచ్చి చెప్పాడు అట ఏవండీ నా భార్యకి నేనంటే ఎంతో ఇష్టం, మా అమ్మకి కూడా నేనంటే ఎంతో ఇష్టం. ఎంతో అదృష్టవంతుడిని అండి నేను. వాళ్ళ గురువుగారు చెప్పారు అట. అయితే నువ్వు ఒక పని చెయ్యి, మీ అమ్మకి నువ్వంటే చాలా ఇష్టం అంటున్నావు. మీ ఆవిడకి నువ్వంటే ఇష్టం అంటున్నావు. నేను మీ ఇంటికి వస్తాను. నువ్వు చచ్చిపోయినట్టు పడి ఉండు. కాళ్ళు కదపకు, చేతులు కదపకు, గాలి మటుకు బాగా బిగించేసి కొంచెం వెళ్ళినా ఫరవాలేదు అటు ఇటు, మొత్తానికి బిగించేయకు, అలా చచ్చిపోయినట్టు అలా పడి ఉండు. సరే వెళ్ళాడు ఇతను, అతను మరణించినట్టు పడి ఉన్నాడు. నిజంగా అతను తల్లి, భార్య ఇద్దరూ సమానంగా ఏడుస్తున్నారు పాపం. భార్య ఏడుపు, తల్లి ఏడుపు, ఇతను అంతా వింటున్నాడు. గురువు గారు వచ్చి ఏమన్నారు అంటే, అతను బ్రతకడం కష్టం కానీ మీకు నేను ఒక మందు ఇస్తాను. తల్లితో ఏమని చెప్పాడు అంటే నేను ఒక మందు ఇస్తాను ఈ మందు పుచ్చుకోగానే మీరు చస్తారు. మీ అబ్బాయి మటుకు బ్రతుకుతాడు అని చెప్పారు. వీళ్ళు ఏడుపు ఆపు చేసి ఆలోచన మొదలు పెట్టారు. ఈవిడ ఆలోచన మొదలు పెట్టిందని భార్యని అడిగాడు, ఏవమ్మా పోనీ నీకు ఇస్తాను నువ్వు చస్తావా, నీ భర్త బ్రతుకుతాడు అని. వాళ్ళు ఆలోచన మొదలు పెట్టారు. కొడుకు మీద ప్రేమ లేదని కాదు ముసలమ్మ ఏమంటుంది అంటే ఏవండీ మా కుటుంబం



**దేహం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది. ఎక్కడో వైకుంఠంలో దేవుడు ఉన్నాడని మనం అనుకొంటాము. ఇది మన అజ్ఞానానికి గుర్తు. నేను, ఈలోకం, భగవంతుడు మూడూ కలిపి ఒక ముద్ద అయిపోవాలి. అప్పుడు వాడికి లోపల ఉన్న వస్తువు తాలూక అనుభవం కలుగుతుంది.**

పెద్ద కుటుంబం అండి, ఇప్పుడు నేను చచ్చిపోతే పెత్తనం ఎవరు చేస్తారు అని అడిగింది. వీడు చావలేదు కదా ఇది అంతా వింటున్నాడు. పోనీ భార్యని అడిగాడు ఏవమ్మా పోనీ నీకు ఇస్తాను మందు నువ్వు చచ్చిపోతావా, ఆవిడ ఏమంది అంటే ఆవిడ ఆలోచన మొదలు పెట్టి ఏవండీ పిల్లలు చిన్న పిల్లలు అండి, ఈ పిల్లలని ఎవరు పెంచుతారు అని అడిగింది. అత్తగారు కుటుంబం చూసుకోవాలి, నేను చిన్న పిల్లలని చూసుకోవాలి. ఇద్దరి మాటలు విన్నాడు అతను లేగిచి కూర్చున్నాడు. ఇది భ్రాంతి అని ఇప్పుడు నాకు అర్థం అయ్యింది. ఇంతకాలం భ్రాంతి, భ్రాంతి అని మీరు చెబుతున్నారు. కానీ ఇదంతా ప్రేమే అనుకుంటున్నాను. ఇప్పుడు తెలిసింది ఇదంతా భ్రాంతే, ప్రేమ కాదు అని. అంటే తన అనుభవానికి వచ్చే వరకు తనకి తెలియదు.

ఇంకొకతను చెప్పాడు నా భార్యకి నేనంటే చాలా ఇష్టం అని, ఈ గురువుగారు ఏమి చేశాడు అతనికి కాళ్ళు, చేతులు ఒంకరలు పోయినట్టు నటించి, చచ్చినట్టు పడి ఉండమన్నారు. వాడు నిజంగా చచ్చినట్టే పడి ఉన్నాడు, తీసుకుపోదాం, తీసుకుపోదాం అనుకుంటున్నారు. భార్య చాలా బాధ పడుతోంది. ఈ గురువు గారు ఒక ప్లాను వేశాడు. ఆ చచ్చిపోయిన వాడు ఏమి చేశాడు అంటే కాళ్ళు ఒక పక్కకి, చేతులు ఒక పక్కకి వేలాడదీసి అలా శవంలాగా పడి ఉన్నాడు. ఊర్లో వాళ్ళు పదిమంది పోగు పడ్డారు శవాన్ని తీసేటప్పుడు ఏవండీ ఈ తలుపులు అడ్డు వస్తున్నాయి. గుమ్మం అడ్డు వస్తుంది శవాన్ని బయటకు తీసుకుపోతుంటే, తలుపులు తీసేసి ద్వార బంధంతీసి మళ్ళీ రేపు మాములుగా కట్టేసుకుందాం. అని ఊర్లో వాళ్ళు ఏమి చేస్తున్నారు అంటే తలుపులు, ద్వార బంధం తీసేయటానికి చూస్తున్నారు. అప్పుడు ఈ భార్య ఏమంది అంటే ఏవండీ చచ్చిపోయిన వాడు ఎలాగూ చచ్చిపోయాడు కదా, మీరు ద్వారబంధాన్ని తీసేస్తాము అంటున్నారు కదా, ద్వార బంధం తీసేస్తే, వంద రూపాయల పెట్టుబడి వడ్రంగికి ఇస్తేనే కానీ మరల తలుపులు పెట్టటం కుదరదు. ఎందుకు ఈ ఖర్చు అంతా, అందుచేత మీరు ఇప్పుడు ద్వార బంధాన్ని తీసేసే బదులు మా ఆయన కాళ్ళు, చేతులు నరికేయండి. ఎలాగో కాలిపోయేవే కదా అవి, కాళ్ళు, చేతులు

నరికేసి ఒక మూట కింద కట్టేసి తీసుకుపోండి. అప్పుడు నాకు ఈ ద్వార బంధం ఇబ్బంది ఉండదు అని చెప్పింది. భార్య నోటి వెంట ఆ మాటలు విని వీడు లేచి కూర్చున్నాడు. వీడు నిజంగా చస్తే కదా ఇప్పుడు.

లోపలకి తీసుకు వెళ్ళండి. మన సబ్జెక్టుకి ఎంతసేపు కావలసింది magic కాదు logic కావాలి. ఇప్పుడు ప్రపంచానికి magic కావాలి కానీ logic అక్కర్లేదు. Logic అయితే బుర్రకి పని చెప్పాలి. Magic అయితే కళ్ళతోటి చూస్తే సరిపోతుంది. మీరు వంట ఎలా నేర్చుకుంటున్నారో, వ్యవసాయం చేసేవాళ్ళు వ్యవసాయం ఎలా నేర్చుకుంటారో, ఏ పని అయినా సరే, అలా విశ్వాసంగా మనం నేర్చుకోవాలి అండి. విశ్వాసం ఉంటేనే నిదర్శనం. విశ్వాసం లేనివాడికి నిదర్శనం ఏమిటి అసలు. అరటకట్ల భక్తులు అంటే నాకు ఎక్కువ ఇష్టం, ఎందుచేత అంటే వాళ్ళ విశ్వాసంలో చలనం లేదు. భగవాన్ పట్ల వాళ్ళకున్న విశ్వాసంలో చలనం లేదు. అది వాళ్ళ జన్మాంతర సుకృతం, భగవాన్ వాళ్లకిచ్చిన అనుగ్రహం. బోధ మాటల తోటి చెప్పక్కర్లేదు. మౌనంతో కూడా చెప్పవచ్చు. మాటల తోటి చెప్పే బోధ కంటే మౌనం తోటి చెప్పే బోధ శక్తివంతమైనది.

కొంతమంది ఏమనుకుంటారు అంటే పూర్వపు రోజులు చాలా మంచివి, రాముడి కాలం చాలా మంచిది. భగవాన్ కాలం చాలా మంచిది. లేకపోతే కృష్ణుడి కాలం చాలా మంచిది అని అనుకుంటారు. అయితే పూర్వం ఆత్మ ఉంది, ఇప్పుడు ఆత్మ లేదా? పూర్వం అనుగ్రహం ఉంది ఇప్పుడు అనుగ్రహం లేదా? పూర్వం కరుణ ఉంది ఇప్పుడు కరుణ లేదా? అక్కడ విశ్వాసం ప్రధానం కానీ అప్పుడు ఎంత అనుగ్రహం ఉందో ఇప్పుడు అంతే అనుగ్రహం ఉంది. ఈశ్వరుడి పట్ల మనకు ఉన్న విశ్వాసంలో లోపం లేకుండా ఉంటే భగవాన్ ఎలా తరించారో, రామకృష్ణుడు ఎలా తరించాడో, మనం అలాగే తరిస్తాం. అప్పుడు ఎంత ప్రత్యక్షమో ఆత్మ ఇప్పుడు కూడా అంతే ప్రత్యక్షం.

లోకం గురించి రామకృష్ణుడు ఏమి చెబుతున్నాడు అంటే మీకు బాధ గురువులు ఎక్కువ, బోధ గురువులు తక్కువ అంటున్నాడు. రామకృష్ణుడు ఏదైనానోటి వెంట మాట

చెప్పాడు అనుకోండి కొంతమంది వెంటనే నమ్మేవారు అటండి. వివేకానంద అలా కాకుండా ప్రశ్నలు మొదలు పెట్టేవాడు. ఎంతైనా వీడు ప్లీడరు కొడుకు కదా అని రామకృష్ణుడు అనేవాడు. రామకృష్ణుడు దగ్గరకి రాకముందు కూడా నరేంద్రుడు అక్కడకి అక్కడకి వెళ్ళేవాడు. నువ్వు చెప్పే పురాణాలు ఆపు చెయ్యి, నువ్వు దేవుడిని చూశావా, నాకు చూపించగలవా అని అడిగేవాడు. వాళ్ళు కంగారు పడేవారు. కానీ ఈ రామకృష్ణుడు దగ్గరకి వచ్చాక ఆయనను నువ్వు దేవుడిని చూశావా అని అడిగాడు వివేకానంద అందరినీ అడిగినట్టు. నేను చూశాను అన్నాడు. అయితే నాకు చూపించగలవా అంటే చూపిస్తాను. మరి ఎలా చూపిస్తావు. నేను నిన్ను ఎలా చూస్తున్నానో, నువ్వు నన్ను ఎలా చూస్తున్నావో అలాగే చూపించగలను అని చెప్పాడు రామకృష్ణుడు. అప్పుడు వివేకానంద షాక్ అయ్యాడు.

మనం హృదయంలోకి దిగాలి చదువులు కూడా సంసారం లాంటివే. చదువుకుంటే జ్ఞానం వచ్చేస్తుంది అని మీరు అనుకోకండి. చదువుకుంటే సంస్కారమే రావటం లేదు, ఇంక జ్ఞానం ఎలా వస్తుంది? బాగా చదువుకున్న వాళ్ళని కొంతమందిని చూడండి వాళ్లకి సంస్కారమే ఉండదు. ఇంక జ్ఞానం దాకా ఎందుకు అసలు. దానికి దీనికి సంబంధం లేదు, హృదయం పక్కానికి రావాలి. అరుణాచలేశ్వరుడి తోటి భగవాన్ చెబుతున్నారు నా అంతట నేను ఇక్కడికి రాలేదు. నువ్వు రమ్మంటే, నువ్వు ఆహ్వానిస్తే నువ్వు పిలిస్తే నేను ఇక్కడకి వచ్చాను. నువ్వు రమ్మంటేనే అరుణాచలం వచ్చాను. తీరా వచ్చిన తరువాత నువ్వు నా లోపల దూరావు. నువ్వు ఎప్పుడైతే దూరావో నా జీవలక్షణాలు అన్నీ పోయాయి. ఈశ్వరుడు ఎప్పుడైతేహృదయాన్ని స్వాధీనం చేసుకున్నాడో వాడికి ఇంక జీవలక్షణాలు ఏముంటాయి. మన హృదయాలు ఈశ్వరుడి యొక్క ఆలయాలు కాదు, మన హృదయాలు సత్రాలు. అరగంటకి ఒకడు వస్తూ ఉంటాడు ఖాళీ చేసి వెళ్ళిపోతూ ఉంటాడు. అలాగే మన హృదయంలోకి వచ్చేవి ఎన్ని గొడవలో, ఒక్క ఈశ్వరుడికే మనం స్థానం ఇవ్వటం లేదు, మీరేమి కంగారు పడక్కర్లేదు, వస్తువు ఇక్కడే మన హృదయంలోనే ఉంది. ఆ వస్తువు యొక్క రుచి మీరు చూశారో ఇంక వైకుంఠం మీకు అక్కర్లేదు. ఈ భూలోకానికే

కాదు, వైకుంఠానికి అధిపతిగా నిన్ను చేస్తాను అన్నా మీరు కళ్ళు ఎత్తి చూడరు. అయితే ఆ వస్తువుని దర్శించడానికి ఇంద్రియాలు చల్లబడాలి. మనసు చల్లబడాలి. బుద్ధి చల్లబడాలి. చల్లబడిన బుద్ధి, చల్లబడిన మనస్సు, చల్లబడిన ఇంద్రియాలు, ఆ వస్తువును దర్శించగలవు. మన మనస్సులు చల్లగా ఉండేటట్టు చూసుకోవాలి.

అయితే మనలో ఎంతమంది మనస్సులు చల్లగా ఉన్నాయి? మనలో ఎంతమంది ఇంద్రియాలు చల్లగా ఉన్నాయి? మనస్సు చల్లగా ఉంటే, బుద్ధి చల్లగా ఉంటే, ఇవన్నీ చల్లగా ఉంటే కదా ఆత్మను దర్శించేది. ఎవడి ఇంద్రియాలు అయితే చల్లబడ్డాయో, ఎవడి మనసు అయితే బాగా చల్లబడిందో వాడికోసం గురువు వెతుక్కుంటూ వస్తాడు. వాడు గురువు దగ్గరకి వెళ్ళక్కర్లేదు, వాడికోసం గురువు వెతుక్కుంటూ వస్తాడు. ఇది ఈశ్వరుడి యొక్క ఆజ్ఞ. మన మనస్సు అణగలేదు, మన మనస్సు చల్లబడలేదు కానీ ఈశ్వరుడు వచ్చి మనకు కనిపించాలి అంటే ఎలాగ? మనకు ఆచారం అక్కర్లేదు, దేవుడు అక్కర్లేదు. మనకు ఉన్నవి చాదస్తాలు. ఈ చాదస్తాలను మనం ఆచారాలు అనుకుంటున్నాం. గంగానదిలో నీరు బాగు చెయ్యటం కోసం పది కోట్లు ఖర్చు పెడుతున్నారు. మరి మనుషులని బాగు చెయ్యటం కోసం ఏమి ఖర్చు పెడుతున్నారు? నీటిని ప్రక్షాళన చెయ్యటం కోసం కోట్లకి కోట్లు వర్షంప చేస్తుంటే మనుషులని ప్రక్షాళన చెయ్యక్కర్లేదా? మనం తాగే నీరు విలువ, మనం కట్టుకునే బట్ట విలువ కూడా చెయ్యమా మనం?

కూరకి మూత పెట్టాలి అని భగవాన్ అంటున్నారు. కూరకి మూత పెట్టాలి అని



**మనిషికి ఉన్న తెలివిని, వివేకాన్ని మోక్ష స్థితి పొందటం కోసం ఉపయోగించుకోవాలి, అలా చేతకాకపోతే నేర్చుకోవాలి. భౌతికంగా ఎన్ని ఉన్నా అవినయం రాకుండా చూసుకోవాలి. అవినయం వస్తే పతనమవుతారు.**

మీకు తెలియదా? ఆయన చెప్పాలా అంటే దాని అర్థం ఏమిటి అంటే మనసుకి మూత పెట్టాలి. మనం కూరలకి మూత పెట్టడం అందరం నేర్చుకున్నాం, ఇంకా మనసుకి మూత పెట్టడం నేర్చుకోలేదు. కూరకి మూత పెట్టాలి అంటే భగవాన్ చెప్పకుండా చెబుతున్నారు అన్నమాట మనసుకి మూత పెట్టాలి అని, కూరకి ఎప్పుడైతే మీరు మూత పెట్టారో, అప్పుడు ఆవిరి ఆగుతుంది. ఆవిరి ఎప్పుడైతే ఆగిపోయిందో కూర పక్వానికి వచ్చి రుచి పడి తినడానికి యోగ్యం అవుతుంది. అదేవిధంగాఏ రోజున మీరు మనసుకి మూత పెట్టారో, మీ ఇంద్రియాలకి మూత పెట్టారో, అప్పుడు మీరు పక్వానికి వస్తారు. కూర బాగా ఉడికిన తరువాత ఎలా అయితే తినడానికి బాగుంటుందో, అలాగే మీ మనసు ఎప్పుడైతే పక్వానికి వచ్చిందో అప్పుడు సహజంగా మీరు మోక్షాన్ని పొందుతారు. భగవాన్‌కు ఆత్మ తప్పించి ఇంక ఏ గొడవ అక్కరలేదు. భగవాన్ తల్లి ఒకసారి నాకు కాశీ వెళ్ళాలని ఉంది అని అడిగింది. కాశీ అంటే రెండు అక్షరాలు మర్చిపోతే ఏమీ లేదు అన్నారు భగవాన్.

పూర్వం విఠోబా స్వామి అని ఒక స్వామి ఉండేవారు, ఆయన 1910 వరకు ఉన్నారు. అతను పుట్టడం మద్రాసు Triplicaneలో పుట్టాడు. పోలూరులో చాలాకాలం ఉన్నారు. అతనికి ఇష్టమైన దేవుడు ఎవరు అంటే పాండురంగడు. అసలు తల్లి చిన్నప్పుడు చచ్చిపోయింది. తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆ పినతల్లి ఒక రోజు స్నానం చేయిస్తోంది అతనికి చిన్న వయస్సే ఆ స్నానం చేసేటప్పుడు కూడా నామం, నామం మీద ప్రీతి చూడండి వాడికి, స్నానం చేయించేటపుడు కూడా విఠోబా, విఠోబా, విఠోబా ఆగలేక పోతున్నాడు. స్నానం చేయించేటప్పుడు ఆ పదినిమిషాలు కుదురుగా ఉండవచ్చును కదా, ఆ పినతల్లి ఏమి చేసింది నన్ను తోమనివ్వవా సబ్బు పెట్టి, నన్ను తుండు గుడ్డ పెట్టి నీ శరీరాన్ని తుడవనివ్వవా, స్నానం చేసేటప్పుడు కూడా విఠోబా, విఠోబా అని కేకలు వేస్తున్నావు, నోరు ఆగదా నీకు, మనస్సు ఆగదా, స్నానం చేయించేటప్పుడు కూడా విఠోబా, విఠోబా, అన్నం తినేటప్పుడు కూడా విఠోబా, విఠోబా, ఏంటి విఠోబా, విఠోబా, పో ఇంట్లోంచి పో అంది. సవతి కొడుకుని ఇంట్లోంచి బయటకి పంపేయటం కోసం కాదు. స్నానం చేయించేటపుడు కూడా నామం వదలటం

లేదు వీడు. విఠోబా, విఠోబా, విఠోబా, పాండురంగా, పాండురంగా, విఠోబా, విఠోబా, అలా అలవాటు అయ్యిపోయింది అండి bybirth అతనికి. స్నానం చేసేటప్పుడు కూడా విఠోబా, విఠోబా పో, ఇంట్లోంచి పో అంది. స్నానం పూర్తి అయిపోయింది, ఇంటి నుంచి పారిపోయాడు. Time వచ్చింది బయటకి వెళ్ళిపోయాడు. అది ఈశ్వరుడు యొక్క ఆజ్ఞ.

ఒక్క బియ్యపు గింజ ఎక్కడైనా కింద పడితే భగవానే స్వయంగా వంగి ఆ బియ్యపు గింజ తీసి ఆ బియ్యపు గింజలు ఏ డబ్బాలో ఉన్నాయో చూసి ఆ డబ్బాలో పెట్టేవారు అట. ఎందుకు స్వామి ఆ ఒక్క గింజ కోసం ఆ శ్రమ అన్నారు ఒకసారి. అవును నా జాగ్రత్త అటువంటిది. ఏ సంగతిని విడువను అన్నీ సరిగ్గా జరగాలి. నేను పెళ్లి చేసుకుంటే ఏ స్త్రీ కూడా నాతో పడలేదు. అంత కఠినమైన వాడిని. ఈయనకి పెళ్ళాం లేదు ఏమి లేదు, చేసుకుంటే పారిపోను అటండి. ఇక్కడకు వచ్చేసరుకులు అన్నీ పరమేశ్వరుడు పంపిస్తున్న ఆస్తి. వృధాగా పోనివ్వకూడదు. ఈ ఆశ్రమానికి వచ్చే ఆస్తి ఎవరిది? మనం ఏమైనా కష్ట పడుతున్నామా? ఎవరో అనేకమంది భక్తులు పంపిస్తున్నారు ఇవన్నీని. మన తండ్రి సంపాదించి ఇచ్చిన ఆస్తి ఇది. పరమేశ్వరుడు పంపిస్తున్న బహుమానాలు సరుకులు ఇవన్నీ కూడా, ఆశ్రమానికి వచ్చే ప్రతీ వస్తువు జాగ్రత్తగా కాపాడాలి. నా పిల్లలకి పెట్టొద్దా అనేవారు. అంటే పిల్లలు అంటే ఇక్కడ భక్తులు.

శేషాద్రిస్వామి దగ్గరకి ఎవరైనా వస్తే అనేవారు అటండి. వాడి దగ్గరకి పొండిరా లడ్డూలు పెడతాడు అనేవారు అటండి. వంట చేయించటం, తిండి పెట్టడం, ఇవి రెండిటి మీద ఉన్న శ్రద్ధ దేవుడి మీద, ఆత్మ మీద లేదా అనిపిస్తుంది కొత్తవాళ్లకి. ఒకసారి ఒక భక్తుడు భగవాన్‌తో నాకు ట్రైన్ టైం అవుతుంది అండి, వెళ్ళిపోతున్నాను స్వామి అన్నారు. ఇడ్లీ టైం అయ్యిపోయింది కదా, ఇడ్లీ పుచ్చుకుని వెళ్ళమన్నారు. స్వామి టైం అయ్యిపోయింది మళ్ళీ ఇడ్లీ కాఫీ పుచ్చుకుంటే నాకు ట్రైన్ వెళ్ళిపోతుంది అన్నాడు. సరి సరి అన్నారు భగవాన్ ఎవరిని బలవంతం చెయ్యరండీ దేని గురించి అయినా సరే, ఆయన స్టేషన్‌కి వచ్చారు. స్టేషన్‌లో బండి కొంచెం ఆలస్యంగా వచ్చింది. అక్కడ ఇడ్లీ లేదు, కాఫీ లేదు. రేణిగుంటలో


ఎక్కడో దిగారు. అక్కడ టీ లేదు, కాఫీ లేదు. మొత్తం మీద ఇంటికి వచ్చే వరకు ఏ పదార్థాలు ఆయనకి దొరకలేదు. దొరుకుతాయి అనేటప్పటికీ ట్రైన్ కదిలిపోవడం జరిగేది. సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. పొద్దుట నుంచి కాఫీ లేదు, ఇడ్లీ లేదు, ఏమీ లేదు, ఆకలి మీద ఉన్నాడు. ఇంటికొచ్చి భార్యతో చెప్పాడు చాలా ఆకలిగా ఉంది భగవాన్ కాఫీ పుచ్చుకుని వెళ్ళమన్నారు. కాఫీ పుచ్చుకుని వచ్చినా కానీ ట్రైన్ దొరుకును. ఆయన మాట కాదు అని వచ్చేశాను. పొద్దున్నుంచి ఏమి లేదు. అందుకే వెంటనే వంట చెయ్యమంటే ఆవిడ అంది ఇవాళ అన్నం ఎలా తింటారు అండి రేపొద్దున్న మీ నాన్న తద్దినం అంది. తద్దినం అయితే ముందు రోజు మనం ఒంటిపూట ఏదో చేస్తాం, నీకు అన్నం పెట్టను అంది. కాలిపోయాడు మరుసటి రోజు పన్నెండింటి వరకు భోజనం లేదు ఏమి లేదు. భగవాన్ చెప్పారు ఇడ్లీ తిను అన్నారు, కాఫీ తాగివెళ్ళమన్నారు. అంటే ఏమిటండి మీరు స్నానం చేశారా, భోజనం చేశారా అని మిమ్మల్ని అడగటం ఎందుకు అంటే ఆయన మిమ్మల్ని కట్టేసుకుంటారు. మీ పట్ల ఆప్యాయత చూపించి, మీ పట్ల ప్రేమ చూపించి శాశ్వతంగా ఆయనకి కట్టేసుకుని మీ మనసుని ధ్యానం వైపు మేల్కొలపడం కోసం. స్నానాలు, భోజనాలు, బొట్లు కోసం కాదు. ఆయన మీ పట్ల ప్రేమ చూపించి జ్ఞానం వైపు మీ మనసుని కట్టేసుకోవటం కోసం. ఉన్నత శిఖరాల వైపు మీకు తెలియకుండా మిమ్మల్ని తీసుకు వెళ్ళటం కోసం. ఏ కష్టం తెలియకుండా మిమ్మల్ని జ్ఞానులు చెయ్యాలి. ప్రయాణం కూడా ప్రయాణం చేస్తున్నట్టు మీకు తెలియకూడదు. ఆ శ్రమ కూడా మీకు అక్కర్లేకుండా అంతా జరిగిపోతుంది.

ఒకసారి ఏసుక్రీస్తు ఏమి చేసాడు అంటే పది చేపల కూర వండారు. అక్కడ చూస్తే జనం ఎక్కువ ఉన్నారు. ఇంతమంది జనానికి ఎలా వడ్డించమంటున్నారు పది చేపల కూర అని ఏసుక్రీస్తును అడిగారు. వడ్డించండయ్యా వడ్డించండి అన్నాడు యేసు. ఆ రోజు ఎంత కూర వడ్డించినా ఆ కూర అలా మిగిలిపోయింది. ఈ పనులు మటుకు కర్తృత్వం తోటి చేసినవి కాదు. కర్తృత్వం ఉండి చేస్తే వాడు జ్ఞానే కాదు. మహిమలు చూపించాలని చూపించడు. చూపించాలని చూపిస్తే వాడు జ్ఞాని కాదు. ఈ మహిమ

వీళ్ళకి చూపించాలి అనే తలంపు కనుక వస్తే, ఆ తలంపు తోటి చూస్తే వాడు జ్ఞాని కాదు.

మనం ప్రయాణం చేసే రోడ్డు ఎగుడు దిగుడుగా ఉంది అనుకోండి ఏమి రోడ్డు అనుకుంటాం. అదే మన బుద్ధి ఎగుడు దిగుడుగాఉంటే ఎందుకు బాధపడము? జ్ఞానం ఎవరికి కావాలి అండి అందరికీ పుణ్యం, పుణ్యం. అందరికీ పుణ్యమే కానీ జ్ఞానం ఎవరికి కావాలి? పూజ చేసేటప్పుడు కూడా అది ఎవరి కోసం చేస్తున్నాం? ఎందుకు చేస్తున్నాం? అనే భావన మనకి ఉండాలి. పూజ చెయ్యండి కాని ఎవరి కోసం చేస్తున్నాం? ఎందుకు చేస్తున్నాం? పూజ చేయించుకునేవాడు ఎవడు? చేసేవాడు ఎవడు? ఈ ప్రశ్న కూడా మీకు రావాలి. పూజ చెయ్యండి చెయ్యటం, కానీ ఈ ప్రశ్న కూడా మీకు రావాలి. మాకు ఎన్ని దుఃఖాలు వచ్చినా, ఎన్ని బాధలు వచ్చినా, ఎన్ని భారాలు వచ్చినా, ఎన్నో బలహీనతలు మాలో ఉన్నప్పటికీ, ఎన్ని కష్టాలతో, నష్టాలతో, భారాలతో, బాధలతో, నలిగి పోతున్నప్పటికీ జీవితాలు, ఆయన మాతో పాటే ఉన్నట్టు. ఆయన మాకు రక్షణ ఇస్తున్నట్టు, మాకు తోడుగా ఉన్నట్టు మాకు తోచేది, అలా తోపింప చేసేవాడు.

మనకి భయం వేస్తుంది కదా. గాంధీ గారు చిన్నప్పుడు రాత్రి ఒంటిగంటకి యూరిన్‌కు వెళ్ళటానికి మెలకువ వస్తుంది అనుకోండి వాళ్ళ అమ్మని లెగ్గొట్టేవాడు అట, నేను బయటకి వెళుతున్నాను కూడా రమ్మని, వాళ్ళ అమ్మ తిట్టేది, ఏంట్రా ఇంట్లో వాళ్ళ నిద్ర చెడగొడుతున్నావు



**ఆత్మ అంటే భగవంతుని స్వరూపమే. భగవంతుని దయను పొందలేకపోతే, భగవంతునికి ఇష్టులు కాకపోతే భగవంతుడు మన హృదయంలో అత్యంత సమీపంగా ఉన్నప్పటికీ ఆయన స్వరూపాన్ని మనకి ఇవ్వడు. భగవంతునికి ఇష్టులు అవ్వాలంటే మన ఇంద్రియాలను జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోవాలి.**

వెళ్లి పోసుకుని రా అని, ఆ మరుసటి రోజున ఇల్లు తుడిచే దానితో చెప్పాడు అట, నాకు భయం వేస్తోంది అని. అప్పుడు ఆవిడ ఏమి చెప్పింది అంటే బాబూ నువ్వు ఏమి చేస్తావు అంటే, రాత్రి ఎప్పుడైతే మెలకువ వచ్చిందో రామా రామా రామా అనుకో, బయటకు వెళ్లి ఉచ్చ పోసేసుకో, మళ్లీ రామా, రామా, రామా అని లోపలకి వచ్చేయ్. తలుపులు వేసేసుకో, అప్పటివరకు రామా, రామా, రామా అనుకుంటే నీకు భయం పోతుంది అని చెప్పింది. అప్పటి నుంచి రామ నామం నాకు అలవాటు అయ్యిపోయింది అని గాంధీ అన్నారు. ఆ దాసీ చెప్పిన మాట ఆయనను తుపాకి పెట్టి కాల్చినప్పుడు కూడా హే రామ్ అని వచ్చింది. నాకు దాసీ మొట్ట మొదటి గురువు అన్నాడు గాంధీజీ. లోకానికి మహాత్ముడు అయిన తరువాత కూడా, తుపాకి పెట్టి కాల్చినప్పుడు కూడా హే రామ్ అనే అన్నాడు. ఆయన హృదయాన్ని ఎంత పక్వానికి తెచ్చుకున్నాడో రామనామం తోటి తన రక్తం అంతా అలా మిళితం అయ్యిపోయింది. తన మాంసాన్ని, తన రక్తాన్ని, రామనామంలో ఎలా ఉడక బెట్టాడో చూడండి. మరణించేటప్పుడు కూడా ఆయనకు దేహభావన లేదు.

ఇదే రమణమహర్షిని అడిగారు. స్వామి మీకు ఎప్పుడూ భయం వెయ్యదా? ఈయనకి భయం ఏమిటండి? అన్ని విధాలా చెడిపోయాడు. ఇహపర లాభ హీనుడని, ఈ లోకంలో నాకు ఏమి లాభాలు లేవు. పరలోకంలో నాకు ఏమి లాభం లేదు. ఇహపర లాభ హీనుడని, ఇంక ఈయనకి భయం ఏమిటండి? మీకు ఎప్పుడూ భయం వెయ్యదా స్వామి అన్నారు అటండి. భయమా ఈ భూమి మీద భయపడటానికి ఏముంది అన్నారు. మాములుగా ఆయన ఒకరోజు స్కంధాశ్రమంలో కూర్చున్నారు. పాము వచ్చి ఆయన మీద మాములుగా పాకి వెళ్లిపోయింది. ఆయనను కరవలేదు, మాములుగా పాకి వెళ్లిపోయింది. చూసిన వాళ్ళు కంగారు పడి దూరంగా తప్పుకున్నారు. పాము పాకి వెళ్లిపోయిన తరువాత స్వామి మీకు భయం లేదా? అని అడిగారు. అప్పుడు భగవాన్ అంటారు - ఈ పాము గోడల మీద పాకటం లేదా? ఈ పాము చెట్ల మీద పాకటం లేదా? చెట్లు మీద పాకుతుంటే, ఆ చెట్టుకి భయం వేస్తుందా? గోడల మీద పాకుతుంటే ఆ గోడకి భయం వేస్తుందా?

అన్నారు. స్వామి మిమ్మల్ని కరవలేదేంటి ఆ పాము? గోడ మీద పాకుతుంటే ఆ గోడను కరుస్తుందా? చెట్టు మీద పాకుతుంటే ఆ చెట్టును కరుస్తుందా? గోడ మీద పాకినట్టు, చెట్టు మీద పాకినట్టు ఈ దేహం మీద కూడా పాకింది. ఆయనకు భయం ఏమిటండి, భయమా? భూమి మీద దేనికి భయపడడం?

వాసుదేవశాస్త్రి గారు, భగవాన్ విరూపాక్ష గుహలలో కూర్చొన్నారు. అప్పడు విరుపాక్ష గుహ దగ్గరకి పులి వచ్చింది. వాసుదేవశాస్త్రి ఏమి చేశాడు అంటే ఎగిరి గంతేసి పారిపోయి విరుపాక్షగుహ కటకటాల తలుపులు వేసేశాడు. భగవాన్ మీరు కూడా లోపలకి వచ్చేయండి. పులి వచ్చేసింది అంటున్నాడు, ఆ పులి అలాగే ఉంది, భగవాన్ ఏమన్నారు అంటే అది నీళ్లకి వచ్చిందిరా మన కోసం రాలేదు. నీళ్లకి వచ్చింది. నీళ్ళు తాగి వెనక్కి వెళ్లిపోతుంది. భగవాన్ ఎప్పుడైతే అలా చెప్పారో అప్పుడు కటకటాల తలుపు తియ్యకుండా, కటకటాల తలుపు లోపల నుంచి కేక వేస్తున్నాడు అంట పులిని, నీకు ఏమైనా ధైర్యం ఉంటే నా మీదకి వస్తావా అని, వాసుదేవ శాస్త్రి అంటున్నాడు. అప్పుడు భగవాన్ ఒరేయ్ శాస్త్రి ఎంత ధైర్యవంతుడివిరా నువ్వు, తలుపు వేసేసుకుని దానిని యుద్ధానికి రమ్మంటావు ఏమిటి? అన్నారు.

జటాయువుకి ఎటువంటి అదృష్టం పట్టిందో అటువంటి అదృష్టం పట్టింది పళని స్వామికి. జటాయువుని తనతొడ మీద పెట్టుకున్నాడు రామ చంద్రమూర్తి. అలాగే పళని స్వామి శరీరం విడిచి పెట్టేటప్పుడు పళని స్వామి దగ్గరకి వచ్చి తలని తొడ మీద పెట్టుకున్నారు అటండి. ఏమి అదృష్టమో చూడండి, ఆ జన్మాంతర అనుబంధం ఎటువంటిదో, భగవాన్ అనేకసార్లు చెప్పారు అటండి పళని తోటి, ఎందుకురా నువ్వు, నేను ఒకచోట కూర్చోవటం? నీ పొట్ట నువ్వు పోసుకో, నా పొట్ట నేను పోసుకుంటాను. నా కోసం నువ్వు అడుక్కుంటావు ఏమిటి? నువ్వు అడుక్కుని తెస్తున్నావు, మళ్ళీ ఆ కూరలో నాకు వాటా, బియ్యంలో నాకు వాటా, అసలే నువ్వు అడుక్కునే వాడవు. అడుక్కున్న దాంట్లో వాటాలు. నీ పొట్ట ఏదో నువ్వు చూసుకో, నా పొట్ట ఏదో నేను చూసుకుంటాను అనేవారు భగవాన్. అక్షరమణమాల రాసిందే అందుకండి అసలు. ఇద్దరం అడుక్కునే వాళ్లమే, నీ బ్రతుకు ఏదో నువ్వు బ్రతుకు,

నా బ్రతుకు నేను బ్రతుకుతాను అనేవారు అటండి పళని తోటి, స్వామి చెప్పింది బానే ఉంది అని పళని వెళ్ళిపోయేవారు అటండి. రెండో రోజున, మూడో రోజున భగవాన్‌ని విడిచి పెట్టలేక మళ్ళీ భగవాన్ దగ్గరకి వచ్చేసేవారు అట. ఆవుని విడిచి పెట్టి దూడ ఎంతకాలం ఉంటుంది అనేవారు అటండి పళని. అందుచేత పళనిని ఏమంటారు అంటే భగవాన్ నీడ అంటారు. పళని స్వామిని భగవాన్ భార్య అనలేదు, భగవాన్ శిష్యుడు అనలేదు, భగవాన్ నీడ అన్నారు. మనిషి కూడా పెళ్ళాం వెళ్ళకపోవచ్చు మనిషి కూడా నీడ వెళుతుంది. మనిషి కూడా నీడ ఎలా తిరుగుతుందో భగవాన్ కూడా అలా తిరిగేవారు అట పళని. మరణించే టైములో, పళని అదృష్టం చూడండి తన తొడ మీద పెట్టుకున్నారు అటండి పళని శిరస్సు. ఆ పళని ఎంత అదృష్టవంతుడో, ఆ పళనికి ఏ స్థితి వచ్చిందో మీకు అందరికీ కూడా అదే స్థితి వస్తుంది. వెనక, ముందు అంతే. నేను త్రికరణ శుద్ధిగా చెబుతున్నాను. త్రికరణాలు అంటే సాధనాలు. మనం పుణ్యం సంపాదించినా మన మాట, మన చేత, మన మనస్సు. మీకు పుణ్యం తీసుకు వచ్చినా ఇవే, పాపం తీసుకొచ్చినా ఇవే.

భగవాన్ తల్లికి ఎటువంటి స్థితి వచ్చిందో, పళని స్వామికి ఎటువంటి స్థితి కలిగిందో, గోవు లక్ష్మికి ఎటువంటి స్థితి కలిగిందో, మన అందరికీ కూడా అదే స్థితి కలుగుతుంది. కాల పరిణామంలో వెనకా, ముందు కానీ అందరూ ఒకే స్థితికి చేరతాము. భగవాన్ అనుగ్రహం మీ అందరి మీద ఉంది. మీరేమీ సందేహ పడక్కర్లేదు. మీ ఇష్టాయిష్టాల తోటి, మీ రాగ ద్వేషాల తోటి భగవాన్ కి సంబంధం లేదు. మనల్ని రక్షించే భారం భగవాన్ తీసుకున్నారు. మీరు ఇష్టపడవచ్చు, మీరు ఇష్ట పడకపోవచ్చు. మీరు నమ్మచ్చు, నమ్మకపోవచ్చు. ఆ బేరం తోటి సంబంధం లేదు. ఈ గొడవ అంతా ఎందుకు పెట్టుకున్నాం? ఈ భక్తి గొడవ మనకి ఎందుకు? ఈ ఆధ్యాత్మిక గొడవలు మనకి ఎందుకు? భగవాన్ గొడవ మన నెత్తి మీద పెట్టుకున్నాం, భగవాన్ గొడవలు మనకి ఎందుకు? మళ్ళీ మన మామూలు గొడవలలోకి వెళ్ళిపోదాం. ఈ భగవాన్ గొడవ వదిలేద్దాం. అని మీకు ఎప్పుడైనా అనిపించినప్పటికీ భగవాన్ మటుకు మిమ్మల్ని విడిచి పెట్టరు. మీ ఆలోచనల తోటి, మీ

తలంపుల తోటి, మీకొచ్చే రజోగుణం తోటి, వీటి తోటి సంబంధం లేదు. భగవాన్ మిమ్మల్ని తీసుకున్నాడు. మిమ్మల్ని రక్షించే తీరతాడు. ఆయన అనుగ్రహం కనుక మన నెత్తిమీద లేకపోతే ఆయన పేరే మనం తలపెట్టలేము.


మనల్ని నరకానికి తీసుకు వెళ్ళినా, స్వర్గానికి తీసుకు వెళ్ళినా ఈ మనస్సే. శరీరం కాదు. మనల్ని బంధించేసినా, మనల్ని విడుదల చేసినా శరీరం కాదు, మన మనస్సే. బాగు చేసుకోవాల్సింది మన మనస్సును. మనం ఎక్కడ కూర్చుంటున్నాం. ఏమి తింటున్నాం, ఏమి కట్టుకుంటున్నాం అనేది ప్రధానం కానే కాదు. మనం ఏమి తింటున్నా, ఏమి కట్టుకుంటున్నా, ఎక్కడ నివసిస్తున్నా, ఏ ఊర్లో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, ఏ జాతిలో పుట్టినా, ఏ లోకంలో పుట్టినా బాగు చేసుకోవాల్సింది మనస్సునే. మనస్సే బంధానికి కారణం, మనస్సే మోక్షానికి కారణం. మనస్సే నరకానికి కారణం, మనస్సే స్వర్గానికి కారణం. మనస్సే దుఃఖానికి కారణం, మనస్సే సుఖానికి కారణం. ముందు జాగ్రత్తగా, మధ్య జాగ్రత్తగా, చివరి జాగ్రత్తగా చిట్ట చివర ప్రయత్నంగా మనం బాగు చేసుకోవాల్సింది, సరి చేసుకోవాల్సింది మన మనస్సునే. నిత్యం మారిపోయే వాడికి భగవంతుడి గురించి ఏమి తెలుస్తుంది. మనసు మారిపోయే వాడికి శాంతి యొక్క రుచి ఏమి తెలుస్తుంది.

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం అక్షరమణమాల

**జ్ఞానము లేక నీ యాశ దైన్యము బాప**

**జ్ఞానము దెల్పి బ్రోవరుణాచాలా ॥ 40 ॥**

**తాత్పర్యము :** నిన్ను పొందాలని ఉంది, కాని దారి తెలియక అజ్ఞానముతో బాధపడుతున్నాను. నీ ఆత్మజ్ఞానాన్ని నాకు బోధించి, ఈ దీనస్థితి నుంచి నన్ను రక్షించు అరుణాచలా!

ఓఅరుణాచలేశ్వరుడా! నీ మీద నేను ఆశ పడ్డాను. మనకి డబ్బు మీద లోపల ఆశ ఉంది, కాని డబ్బు చేతికి రావటం లేదు, ఏ పని చేసినా కలిసి రావటం లేదు అనుకోండి, ఎంతో దుఃఖపడతాము. ఓ అరుణాచలేశ్వరుడా నీ మీద నాకు ఆశ కలిగించావు, ఇష్టం కలిగించావు. కాని నువ్వు దొరకటం లేదు. డబ్బు కోసం రాత్రిపగలు వాడెంత కష్టపడతాడో, ఆ డబ్బు దొరకకపోతే వాడెంత బాధ పడతాడో, అటువంటి దుఃఖాన్ని నా నెత్తికి కట్టకు. ఈ పెళ్లి కూతురు సాగాదీసేస్తోంది!

ఆశ లేనివాడికి ఏ గొడవ లేదు. కాని పదవి మీద కాంక్ష ఉంది, ప్రతి ఎలక్షను ఓడిపోతుంటే, వాడి బాధ అలాగే ఉంటుంది. చాలా కాలం ఓడిపోయి ఓడిపోయి ఎప్పటికో ఈ మధ్యన ఒకాయన ప్రెసిడెంట్ అయ్యాడు. మీరు ఎవరంటే నేను ప్రెసిడెంటుని అంటున్నాడు పాపం ఆయన. ఎంతో కాలానికి అధికారం వచ్చింది. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి కష్ట పడి, ఆ పదవి సంపాదించుకున్నాడు. అందుచేత ఆయన కులం, మతం, పార్టీ, ఆయన పేరు కూడా మరిచిపోయాడు. మీరు ఎవరు అని అడిగితే, నేను ప్రెసిడెంట్ అంటున్నాడు. ఆయన డిజిగ్నేషన్ చెపుతున్నాడు. ఆ కాంక్ష అలా అనిపిస్తుంది. అదే విధంగా నీ మీద ఆశ పుట్టించావు ఓ అరుణాచలేశ్వరుడా, ప్రేమ కలిగించావు. కాని నువ్వు దొరకటం లేదు. నీ మీద ఆశ కలిగించి నువ్వు దొరకకపోతే ఎంతో వేదన పడతాను. ఇటువంటి దైన్యస్థితిలోకి నన్ను

తీసుకురాకు. అరుణాచలేశ్వరుడా నీ మీద నాకు ప్రేమ కలిగింది, కానినా కళ్లతోటి చూద్దామంటే నా అధికారం, డబ్బు, నా గొడవే కనిపిస్తోంది కాని, నా కళ్లకి నువ్వు కనిపించటం లేదు. ఆశ ఉంది కాని వస్తువు దొరకటం లేదు.

ఓ అరుణాచలేశ్వరుడా, 'జ్ఞానము లేక నీ యాస దైన్యము బాప' - నీ మీద ఉన్న కోరిక నెరవేరక నేను దైన్యంలో పడ్డాను. రమణమహర్షి అనే పెళ్లి కుమార్తె ఎంత అద్భుతంగా ఇక్కడ చెపుతుందో చూడండి. నిన్ను పొందాలి అని ఉంది కాని, ఎలా పొందాలో తెలియటం లేదు. నాకు మోక్షం కావాలని ఉంది కాని ఆ మోక్షం ఎలా సంపాదించాలో తెలియటం లేదు. ఆ క్లూ, ఆ రహస్యం నువ్వు చెప్పాలి. అరుణాచలేశ్వరుడిని పొందాలి, అంతటి వాళ్లం అవ్వాలి అని ఉంది కాని నిన్ను పొందే మార్గం తెలియటం లేదు. ఉపాయం తెలియక, మార్గం తెలియక దైన్యమైన స్థితిలో పడ్డాను. నిన్ను ఎలా పొందాలో తెలుసుకునే జ్ఞానం నాకు లేదు. ఆ జ్ఞానం లేని మూలంగా నాకు దైన్యం పట్టుకుంది. అదే నన్ను పీడిస్తోంది. ఇంత బాధకు గురి చేస్తావా అరుణాచలేశ్వరుడా! పోనీ నన్ను పూర్తిగా వదిలేసావా అంటే పూర్తిగా వదిలేయలేదు. తలుపు సందులో నొక్కినట్టు నొక్కేస్తున్నావు. నీ మీద ఆశ చూపించావు. నువ్వు దగ్గరకు రావు. నీమీద కోరిక కలగచేసావు. నా చేతికి దొరకవు. ఇటువంటి అవస్థలో నా బాధ, పోరాటం ఏమైనా గ్రహించావా అరుణాచలా!

ఈ జీవుడి వేదన, నిస్సహాయత నువ్వుఏమైనా గుర్తించావా! నన్ను ఇలా వదిలేస్తావా! నాకు పరమార్థజ్ఞానం ఇవ్వకపోయినా నాకు మార్గం చూపించు అరుణాచలేశ్వరుడా! మార్గం నువ్వే, గమ్యం నువ్వే. నాకు మార్గం వేరు గమ్యం వేరు కాదు. నువ్వే ఉపాయం, నువ్వే దేవుడు, నువ్వే మోక్షానివి, అన్నీ నువ్వే. నువ్వు తప్పించి నాకు ఏమి అక్కరలేదు. ఎక్కడ చూసినా నీ స్వరూపమే నాకు కనిపిస్తోంది. నీ కోసమే నేను వేదన పడుతున్నాను. ఎందుకు నన్ను సఫ్ఫరింగుకి గురి చేస్తున్నావు. నాకోసం ఒక మార్గాన్ని చూపించు, జ్ఞానం నాకు ప్రసాదించు.

అరుణాచలేశ్వరుడా, నిన్ను తెలుసుకునే జ్ఞానం లేక, నీ దగ్గరకు వచ్చే దారి తెలియక ఇంత వేదన పడుతున్నాను. నిన్నే గమ్యంగా పెట్టుకొని నేను జీవిస్తున్నాను. నీకోసం మరణించటానికి సిద్ధంగా ఉన్న నన్ను వదిలేసి, మార్గం చూపించకుండా ఏమీ తెలియనట్టు

దూరంగా తప్పుకుని తిరగటం మంచిది కాదు. నువ్వు నా చెయ్యి పట్టుకొని దారి చూపించవలసిన అవసరం ఇక్కడ ఉంది. ఓ అరుణాచలేశ్వరుడా నాకు నిజమైన జ్ఞానాన్ని ఇచ్చి దారి చూపించు ఏదో కళ్ళకి కనపడి, దర్శనం ఇచ్చి రక్షించటం కాదు. ఏదైతే మానవుడు తెలుసుకోవలసిన అంతిమ సత్యమో, ఏదైతే పరమార్థమో, దేన్ని తెలుసుకుంటే ఇంక దుఖం పుట్టదో, దేన్ని తెలుసుకున్నాక దానిని మించి తెలుసుకోవలసింది లేదో, దేన్ని తెలుసుకుంటే సుఖసముద్రంలో మునిగిపోతానో, అటువంటి వస్తువు నా హృదయంలోనే ఉంది. అదితెలుసుకునే జ్ఞానం నాకు కలుగజేయి. అది తప్పించి మిగతాది అంతా అజ్ఞానమే. నువ్వు నాకు ఆత్మజ్ఞానం ప్రసాదించే వరకూ నాకు వేదన రోదన తప్పవు. అంతవరకూ ఈ జన్మలు, రోగాలు, ఈ రాకపోకలు, లోకాలు తిరగటం తప్పదు. మన దేహాలు, పరిసరాలు, దేశాలు మారతాయి కాని, మన అహంకారం మారదు.

ఈ దేహానికి మరణం రాక ముందే అజ్ఞానం, అహంకారం తొలిగించుకోవాలి. అలా తొలిగించుకోకపోతే మళ్ళీ కొత్త దేహం వస్తుంది. కొత్త వాతావరణం వస్తుంది, కొత్త పరిస్థితులు వస్తాయి. అన్ని సమస్యలను పుట్టించేది అహంకారమే. అయితే అహంకారం అనే సమస్యను నువ్వు పరిష్కారం చేసుకో. నువ్వు ఎంత ధనవంతుడివి అయినప్పటికీ, నీకు ఎంత కీర్తి ఉన్నప్పటికీ, జ్ఞానం సంపాదించకుండా శరీరాన్ని విడిచి పెట్టేస్తే, నువ్వు అనుభవించే నష్టాన్ని ఎవరూ అంచనా వేయలేరు. ఎన్ని సంపాదించినప్పటికీ, జ్ఞానం లేకపోతే అవన్నీ ఒకటి లేని సున్నలు. కంఫర్ట్ అవసరమే కానీ, కంట్రోల్ ముఖ్యం. మైండ్ కంట్రోల్ లేకపోతే, ఎన్ని భోగాలు ఉన్నప్పటికీ, అవి మీకు దుఃఖాన్ని తీసుకొస్తాయి. అంటే దుఃఖ కారణమైన అజ్ఞానాన్ని తీసేసే వరకూ, దుఃఖం నీకూడా వస్తూనే ఉంటుంది. జన్మజన్మలకి నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. అందుచేత దుఃఖానికి కారణం అయినటువంటి అహంకారాన్ని నువ్వు విడిచిపెడితే, నీకు ఆత్మజ్ఞానం, ఆత్మశాంతి, ఆత్మవైభవం ఈదేహంలో ఈలోకంలో ఉండగానే నీకు అందుతాయి, అంటున్నారు రమణస్వామి.

శ్రద్ధ లేకపోతే జ్ఞానం రాదు. ఎటువంటి శ్రద్ధ నా హృదయములో కలిగితే నాకు ఆత్మ జ్ఞానం కలుగుతుందో, అటువంటి శ్రద్దని కూడా నువ్వే ఇచ్చి నాకు జ్ఞానం కలుగచెయ్యి అరుణాచలేశ్వరుడా!

# నాన్నగారు - శాంతి సముద్రం

**- రామచంద్ర రాజు గారు, వడ్లవానిపాలెం**



అది ఒకనాటి సాయం కాలము. సద్గురువు శ్రీ నాన్నగారిని చూడాలని జిన్నూరు వారింటికి వెళ్లాను. ఆ సమయంలో ఆయన ఒక్కరే అరుగు మీద కుర్చీలో నిర్మలంగా, ఏకాంతంగా కూర్చుని ఉన్నారు. ఆయన నన్ను చూసి కూర్చోమన్నారు. నా యోగక్షేమాలన్నీ అడిగి తెలుసుకున్నారు. అలా మొదటి దర్శనంతోనే హృదయానందంతో రాత్రి మా ఇంటికి వెళ్లాను. ఆ రోజు నుండి శ్రీ నాన్నగారిని చూడటానికి రోజూ వారింటికి వెళ్లివస్తూండేవాడిని. నాకు రోజూ భక్తి, కర్మ, జ్ఞాన, వైరాగ్యాలను సమన్వయం చేస్తూ బోధిస్తూ ఉండే వారు. భగవాన్ శ్రీ రమణమహర్షి గురించి, అరుణాచల వైభవం గురించి తరచూ తెలియజేస్తూ ఉండేవారు. నాకు భగవదనుభవం పొందాలనే కాంక్ష కలిగింది. శ్రీ నాన్నగారితో సహవాసం వలన నా జీవితం మలుపు తిరిగింది.

శ్రీ నాన్నగారి దర్శన భాగ్యం వలన, ఆయన సన్నిధి మాత్రం చేత, ఆయన బోధల వల్ల నేను మా ఇంటికి వెళ్లినా, ఏ పని చేస్తున్నా, నిద్రిస్తున్నా, నిరంతరం ఆయన నా స్మృతిలో ఉంటూ, నాలో ఉంటూ, నన్ను నడిపిస్తున్నట్లుగా ఉండేది. నా హృదయాంతరాలలో నుండి ఒక తెలియరాని ఆత్మానందం వెల్లుబికి వచ్చేది. ఈ ఆనందం, ఈ వైభవం ఏమిటని నన్ను నేనే నమ్మలేక పోయేవాడిని. అలా ఆయనను చూసినంత మాత్రాన, ఆయన ప్రవచనాలు విన్నంత మాత్రాన ఆయనతో ఉన్న సన్నిహిత సహచర్యం వల్ల- ఆనందం, శాంతి, కాంతి, సత్యం, ప్రేమ నా స్వంతమై నా అనుభవంలో శాశ్వతమైతే ఇంక ఎంత బాగుంటుందోనని, అంతకంటే సాధించేది లేదనిపించింది. ఆయన చూపులో, వాక్కులో ఎంతో ప్రేమానురాగాలు పొంగివచ్చి నా హృదయంతరాలలో ప్రవేశించి నన్ను అంతర్ముఖపరిచేవి.

మానవతా విలువలు క్షీణిస్తున్న ఈ కాలంలో జాతిని జాగృతం చెయటానికి సద్గురు నాన్నగారు జ్ఞాన నిధిగా శాంతిని ప్రజలకు అందించాలనే మహత్తర ఆశయంతో మన మధ్య నిలిచారు. మానవుడిని దుఃఖం లేని స్థితికి తీసుకుని వెళ్లటమే సద్గురు శ్రీ నాన్నగారి

ప్రవచనములలోని ముఖ్య ఉద్దేశ్యం. ఇతరుల నుండి ఆయన కోరుకునేది వారి సుఖ శాంతులు మాత్రమే. శ్రీ నాన్నగారిలో నిగూఢంగా దాగి ఉన్న అంతర్వాహిని శక్తి దివ్యానుభూతులను కల్గించి, శాంతి తీరాలలో మనస్సును లగ్నం చేయటమే ఆయన సన్నిధిలో జరిగే గొప్ప విషయం. ఇది మహర్షులకు, మహాత్ములకు, జ్ఞానులకు మాత్రమే సాధ్యం.

తండ్రిగా, తల్లిగా, యజమానిగా, ఆచార్యునిగా, మిత్రునిగా సద్గురు శ్రీ నాన్నగారు మన ముందు ఒక మానవ దేహంలో సంచరించారు. హృదయగుహలో ఉన్న అంతరాత్మ యొక్క సజీవ ఆవిష్కృతి యైన సద్గురు శ్రీ నాన్నగారిని దర్శించినచో విశ్వాత్మ ఒక అమూల్యమైన నిధిగా మనకు అందుబాటులో ఉన్నదని గ్రహించగలము.

ఆకలి పోగొట్టే అన్నదాత కంటే అజ్ఞానం పోగొట్టే జ్ఞాన దాత శ్రేష్టుడు. ఇది శ్రీ నాన్నగారు చేసే జ్ఞానయజ్ఞాల ప్రధాన ధ్యేయం. తనకున్న శక్తులన్నీ సమాజ కల్యాణానికి ఉపయోగించాలనే తపన మాత్రమే శ్రీ నాన్నగారి ప్రబోధాలలో మనకు అర్థమవుతుంది.

ఋషులు వేద మంత్రాలను దర్శించినట్లే సద్గురు శ్రీ నాన్నగారు తాను పొందిన ఆత్మానుభూతికి ప్రేమని జోడించి అన్ని వర్గాల వారికి, వారి అమృత వాక్కులుగా వినిపిస్తున్నారు. ఆ వాక్కులు విని నేడు భక్తులు ఎంతో సుఖంగా జీవించగలుగుతున్నారు. వినేవారి గ్రహణశక్తిని అనుసరించి మహార్థములు స్ఫురిస్తూ ఉంటాయి.

తొలుత శ్రీ నాన్నగారి "అమృతవాక్కులు" శ్రవణం చేసిన వారు, చదివిన వారు ఎంతో ప్రభావితులై, వేదాంతాన్ని, ఉపనిషత్తుల సారాన్నంతా సులభ శైలిలో అందరికీ అర్థమైయ్యేటట్లు బోధించే మహాత్ముని దర్శించటానికి సుదూరమైన ప్రాంతాల నుండి వచ్చి ఆనందపరవశులయ్యేవారు. శ్రీ నాన్నగారు సన్నిధి మాత్రం చేతనే భక్తులను పునీతులను చేయగల స్థితప్రజ్ఞులు.

ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, వివేకంగా జీవించాలని, చైతన్యవంతులవ్వాలని తనలో దాగి ఉన్న అంతర్వాహినియైన శక్తిని సుఖస్వరూపాన్ని తెలుసుకొని అందరూ అమృతమూర్తులు కావాలనే తపనతో వారు నిరంతరం, నిర్విరామంగా జ్ఞానయజ్ఞాలు చేస్తూ, కృషి చేసేవారు. అంతేగాని తన ఆశ్రితులందరూ ఏ దేవునికో, రమణమహర్షికో, తనకో అవివేకంగా మూఢభక్తులు కావాలని శ్రీ నాన్నగారి ధ్యేయం కాదు. ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో సద్గురు శ్రీ నాన్నగారి ప్రబోధనలు సువర్ణాక్షరాలతో లిఖింపబడతాయి.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# మహా నిర్వాణం

భగవాన్ శ్రీరమణమహర్షి దిII 14-04-1950 రాత్రి గంII 8-47 నిIIలకు అరుణాచల క్షేత్రంలో తన భౌతిక శరీరాన్ని విడిచిపెట్టారు. ఆ క్షణం నుండి శరీర ధారిగా భగవాన్ ఇక లేరు - దానినే మహా నిర్వాణం, మహా నిష్క్రమణం అని పిలుస్తారు. భగవాన్ శరీరం విడిచిపెట్టిన సమయంలో ఒక దివ్యకాంతి, ఒకజ్యోతి ఆయన శరీరం ఉన్న నిర్యాణపు గది గోడను ఆనుకొని పయనిస్తూ అరుణగిరిలో ఐక్యమైంది. అదే విధముగా భగవాన్ శరీరం భూమి మీదకు వచ్చినప్పడు, అనగా తిరుచ్చుళిలో దేహం ధరించినప్పడు, ఒక జ్యోతి ప్రకాశం అక్కడ పురిటి గదిలో ఉన్న ఒక అంధురాలికి కనబపడటంతో ఆయన అవతారం ప్రారంభమై, ఆ మహా ప్రస్థానం చివరికి అరుణాచలంలో అరుణగిరిలో ఐక్యం అవడంతో ముగిసింది. సెప్టెంబరు 1, 1896న అరుణాచలంలో అడుగుపెట్టినది మొదలు, చివరి శ్వాస విడిచిపెట్టేవరకు, అనగా ఏబదినాలుగు సంవత్సరములు అరుణాచల క్షేత్రాన్ని విడిచిపెట్టి భగవాన్ ఎక్కడికీ వెళ్ళలేదు. తాను శాంతిగా నిష్క్రమించారు. జనన-మరణ చక్రం అనే మహావ్యాధి నుండి విడుదలపొంది, ఆత్మసామ్రాజ్యానికి అధిపతియైన రమణునికి చనిపోవడం అనే మాటకు అర్థం ఏముంటుంది? పెద్ద అబద్ధం శరీరం చనిపోవడం. జనన-మరణాలు వ్యవహారిక సత్యములు మాత్రమే! అవి దేశ కాలాలకు చెందినవి, అవి మన తలంపు ఎంత నిజమో అవీ అంతే నిజం. కేవలం ఉన్నదేదో ఉంది అదే - నేను! అదే సత్యం! తదితరమంతా సత్యము యొక్క ఆభాసే! గురువంటే శరీరము కాదు, గురువంటే ఆత్మ. ఆత్మ ఎక్కడ నుండీ రాదు, ఎక్కడికీ పోదు. దేహము జీవించి యుండగానే, దేహాత్మ బుద్ధి నుండి విడుదల పొంది మనందరికీ మార్గదర్శకులయ్యారు భగవాన్. అజ్ఞానంతో పుట్టాం, అనగా శరీరం వచ్చింది, జ్ఞానంతో మరణించాలి.

**(దిII 14-04-2022 భగవాన్ శరీరం విడిచిపెట్టిన రోజు సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

## విషయ ప్రపంచాన్ని చూసి భక్తుడు పారిపోడు - దాని లేమితనాన్ని గ్రహించి మేలుకొంటాడు

జె.కె. "శృంగార భావనకు నేను వ్యతిరేకిని కాను. దాన్ని వేరే దృష్టితో (ఆత్మ దృష్టితో) చూడగలిగితే లైంగిక భావనలు అణచవచ్చు. వాటికి దాసుడవు కావద్దు, పారిపోవద్దు. దుఃఖమే ఆశక్తిగా మారుతుంది" అన్నారు. మహాత్ములు అంతా శంకరులతో సహా వారి సాహిత్యంలో "నరకానికి హేతువు ఏది? స్త్రీ. ఒకాయన ఒక అడుగు ముందుకు వేసి స్త్రీని చూస్తేనే స్నానం చెయ్యి. పో" అన్నారు. దీనిపై ఒక యువతి తల్లితో "అమ్మా ఇంత దారుణంగా ఎందుకు అసహ్యించుకొన్నారు?" అనగా తల్లి "ఆ రోజుల్లో ఈ నిందలు వేసేవారు పురుష మహాత్ములు కాబట్టి అలా జరిగింది. తదనంతర కాలంలో స్త్రీజ్ఞానులు వాటిని సరిజేసారు. ఆ అన్నవాళ్ళు కూడా ఒక తల్లికి జన్మించిన వారే కదా!" అన్నది. శ్రీనాన్నగారు "ఏ ఆకారానికి ప్రాముఖ్యంగా ఎంచకూడదు. ప్రాముఖ్యం అనే భావమే మోహంగా పరిణమిస్తుంది" అన్నారు. మనస్సును కట్టుబాటు లేకుండా ఆ వస్తువుల మీద పరుగిడనివ్వకూడదు. ఎంచితే ఆందోళనలు బయలుదేరుతాయి. కామం చెడ్డది కాదు దాని వల్లనే మానవుడుగా జన్మించగలిగాము. ఈ కామం వల్లనే మానవులుగా పరివర్తనం చెందగలరు. ఈ కామం మూలంగానే మానవుడు దేవుడిగా పరివర్తనం చెందగలడు. రామకృష్ణ పరమహంసగారు ఒకరితో "పూర్వం నేను కామాన్ని జయించాలని విలపించాను. నేలమీద, ధూళియందు ముఖాన్ని రుద్దుతూ అమ్మతో అమ్మా నేను ఒక ఘోరమైన అపరాధం చేసాను, కామాన్ని జయించాలనే భావన మళ్ళీ ఎప్పుడూ మదిలోనికి రానియ్యకు అని ప్రాధేయపడ్డాను" అన్నారు. కొందరు స్త్రీమూర్తులు దాంపత్య జీవితంలో భర్త యొక్క కామ కోర్కెను సహనంతో భరిస్తారు. సాధారణంగా స్త్రీమూర్తులకు 50 సం॥లు వయస్సు దాటిన తరువాత కామం రహితమైపోతుంది. పురుష సాధకులు యీ కామంతో వెయ్యిసార్లు పరాజితుడైనా కామంతో పోరుకు సిద్ధం కావాలి" అంటారు. మహాత్ములు ఒక బాబా "మేము తలచుకొంటే మీ కామాన్ని ఒక్క క్షణంలో నిశ్శేషం చేయగలము. ఈ లోపులో మీ పని మీరు చెయ్యండి. పెనుగులాటలేని పోరాటంలో ఆనందం లేదు అనేక పరాజయాల తరువాత వచ్చే విజయమే ఆనందానికి హేతువు అవుతుంది" అన్నారు. కామంతో మన పోరాటంలో శక్తిలేకపోతే గురుదేవులతో అయ్యా "యీ విషయంలో నా ప్రయత్నానికి సాధ్యం కావటం లేదు, మీ అనుగ్రహంతో సాధ్యమవుతుంది" అని ప్రాధేయపడాలి. భాగవతంలో "కామ నివారణకు ఇష్ట దేవతా పాద పీఠంపై ప్రయత్న పూర్వకంగా ప్రార్థించటమే" అన్నది. బుద్ధుడు "మనస్సులో ఏ పిచ్చి పెట్టుకోకు. అంటే కామపిచ్చి లేని వస్తువు దొరుకుతుంది" అన్నారు. "దృశ్యం ఉన్నంతకాలం దుఃఖం తప్పదు. మనస్సు అణిగితేనే దుఃఖం లేదు, మన అజ్ఞానమే మనకు శిక్ష" అంటారు అనుభవజ్ఞులు. కాకిరెట్టను చూస్తే ఎంతరోత పుడుతుందో అటువంటి విషయాలపై ఆ భావన కలగాలి. వైరాగ్యం ఉంటే అన్నీ సత్ఫలితాలు కలుగుతాయి. విషయాలపట్ల ధ్యాస లేకపోతే అవి వాటంతట అవి రాలిపోతాయి. నిరంతరం విషయచింతన చేసేవానికి భ్రాంతి పెరిగి సత్యానికి దూరమవుతాడు. దానికి బదులుగా "రమణాయ, రమణాయ, రమణాయ నమః" అని వాటికి వ్యతిరేక భావనలో మంత్రం చెయ్యాలి. అప్పుడు అవి దూరమవుతాయి. బుద్ధి తక్కువ వాళ్ళు విషయ వాసనలలో ఎంతో ఆనందం ఉందని దాన్ని జుర్రుకుంటారు. సూక్ష్మ దృష్టి గలవాళ్ళు ఆత్మానందంలో ఆనందం కోసం ఆతృత పడతారు. సుఖం ఎక్కడ ఉందో తెలియదు. అంతా జడ పదార్థం పైనే దృష్టి. ఈ రకం ఉంటే అమృతస్థితికి వేలాది మైళ్ళు దూరంలోనే ఉంటాము అని గ్రహించాలి సాధకుడు. **- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్: 9491968966**